క్లుప్తంగా

దత్తాత్రేయ స్వామికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం గురువారం సందర్భంగా శ్రీశైల ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీ దత్తాత్రేయ స్వామికి విశేష పూజలను దేవస్థానం శ్రీశైల దేవస్థాన ఈఓ, అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

ఆలయాల అభివృద్ధికి విరాళం



వాల్మీకి ఆలయ కమిటీకి నగదు అందజేస్తున్న దృశ్యం

పగిద్యాల: దేవాలయాలు, మజీద్ మీనార్ నిర్మాణాలకు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి రూ. 7లక్షలు విరాళంగా అందజేశారు. గురువారం మండలంలోని పాత ముచ్చుమర్రిలో సర్పంచ్ పెద్ద ఆంజనేయులు, మాజీ సర్పంచ్ మద్దిలేటి, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, నాగేశ్వరరెడ్డి ఆలయ కమిటీ సభ్యులకు సిద్ధార్థరెడ్డి పంపిన నగదును అందజేశారు. పాతముచ్చుమర్రిలో వాల్మీకి మహర్షి దేవాలయానికి రూ. 2 లక్షలు, మసీద్ మీనార్ నిర్మాణానికి రూ. 3 లక్షలు, నందికొట్కూరు మారుతీ నగర్ అబుహనీఫా మజీద్ అభివృద్ధికి రూ. 2 లక్షలు అందజేయడంపై కమిటీ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

వడ్డె ఓబన్నను ఆదర్శంగా తీసుకోవాలి



ఓబన్న చిత్ర పటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

నందికొట్కూరు: తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడు రేనాటి వీరుడు వడ్డే ఓబన్నను ఆదర్శంగా తీసుకోవాలని వడ్డెర సంఘం జిల్లా నాయకులు రాజు, శివమణి, డాక్టర్ బత్తుల సంజీవరాయుడు అన్నారు. గురువారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి పగిద్యాల రోడ్డు వడ్డె పేట వరకు ఓబన్న చిత్ర పటంతో ర్యాలీ నిర్వహించారు. వడ్డె పేటలో ఓబన్న చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం నాయకులు చిన్న, శివకృష్ణ, శ్రీనివాసులు, వెంకటరమణ, డాక్టర్ శ్రీనివాసులు, ఆజాద్, నరసింహులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కార్తీక్ ప్రీమియర్ లీగ్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నాయకులు

ఆత్మకూరు: పట్టణం, మండలంలో గురువారం వివిధ క్రీడా మైదానాల్లో కార్తీక్ ప్రీమియర్ లీగ్ పోటీలు కొనసాగాయి. పట్టణంలో సార్జా గ్రౌండ్‌లో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్‌మీర్, నాయకులు సుల్తాన్, రషీద్, సిద్ధాపురం వద్ద వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాజమోహన్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ లక్ష్మీరెడ్డి, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, మౌలాలి, రవినాయక్ క్రీడా పోటీలను ప్రారంభించారు.

అంబేడ్కర్ మార్గంలో నడుద్దాం



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

పాములపాడు: ప్రతి ఒక్కరూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మార్గంలో నడవాలని వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి మధుసూదన్‌రావు కోరారు. గురువారం జూటూరు గ్రామ సచివాలయంలో జన్ భాగిదారి (సామాజిక సమతా సంకల్పం) కార్యక్రమంలో భాగంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు అంబేడ్కర్ మార్గాన్ని అనుసరిస్తామని ప్రతిజ్ఞ చేసి సంతకాలు చేశారు. పంచాయతీ కార్యదర్శి పుల్లయ్య, నాయకులు ఉపేంద్ర, జనార్దన్ పాల్గొన్నారు.

రజకులకు రక్షణ చట్టం ఏర్పాటు చేయాలి

ఆత్మకూరు: రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని రజక వృత్తిదార సంఘం జిల్లా కన్వీనర్ వెంకటేశ్వర్, కార్యదర్శి శ్రీరాములు కోరారు. పట్టణంలోని రజక వీధిలో 2024 నూతన క్యాలెండర్ ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టం తరహాలో రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలన్నారు. నాయకులు వెంకటసుబ్బయ్య, సుంకన్న, శ్రీనివాసులు, శ్రీరాములు, సురేష్ పాల్గొన్నారు.

హోరాహోరీగా ఆడుదాం ఆంధ్రా పోటీలు



కబడ్డీలో ఫైనల్‌కు చేరిన లక్ష్మాపురం- 2 జట్టును అభినందిస్తున్న అధికారులు,



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

పాములపాడు: మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు హోరాహోరీగా జరిగాయి. కబడ్డీ పోటీలను ఎంపీడీఓ గోపీకృష్ణ ప్రారంభించారు. ఫైనల్‌కు ఇస్కాల, మిట్టకందాల జట్లు చేరాయి, కాగా క్రికెట్ పోటీలు ఇంకా కొనసాగుతున్నాయి. వ్యాయామ ఉపాధ్యాయులు రాజశేఖర్, నాగరాజు, శ్రీనివాసులు, సాయికృష్ణ , సుమలత, కళ్యాణి పాల్గొన్నారు.

పగిద్యాల: ఆడుదాం.. ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో రెండో రోజు గురువారం కొనసాగాయి. వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, బాల్‌బ్యాడ్మింటన్‌లో 21 మ్యాచ్‌లు నిర్వహించినట్లు ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. పురుషుల కబడ్డీ పోటీలో పగిద్యాల3, లక్ష్మాపురం2 జట్లు ఫైనల్‌కు చేరాయి. మహిళల విభాగం నుంచి పగిద్యాల1 జట్టు ఫైనల్‌కు అర్హత సాధించింది. వాలీబాల్ పురుషుల విభాగం నుంచి పాత ముచ్చుమర్రి జట్టు, మహిళల విభాగం నుంచి నెహ్రూనగర్ 2 జట్టు ఫైనల్‌కు చేరాయి. బాల్‌బ్యాడ్మింటన్‌లో పగిద్యాల 1, పగిద్యాల 3 జట్లు ఫైనల్‌కు చేరినట్లు వెల్లడించారు. ఎంఈఓలు సుభాన్, మురళీమోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు ఉపేంద్రారెడ్డి, సమత యశోదర, కోట్ల వెంకటేష్, ఫిజికల్ డైరెక్టర్ కృష్ణ, పీఈటీ శ్రీధర్‌కుమార్ ఉన్నారు.

కొత్తపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కిచ్చన్నగారి సుధాకర్ రెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో వ్యాయామ ఉపాధ్యాయులు మురళీ నాయక్ ఆధ్వర్యంలో రెండవ రోజు గురువారం కబడ్డీ పోటీలు నిర్వహించారు. మండల స్థాయికి 11 జట్లు వచ్చాయన్నారు. ఎదురుపాడు, దుద్యాల- 2 జట్లు ఫైనల్‌లో తలపడగా ఎదురుపాడు జట్టు గెలుపొంది నియోజకవర్గ స్థాయికి ఎంపికైందన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ నాగ ఎల్లయ్య, నాయకులు నారాయణరెడ్డి, చింతమాను శ్రీనివాసులు యాదవ్, రహంతుల్లా, లింగారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు చంద్రశేఖర్, స్వప్న శ్రీ, రీనా బేగం, సుంకన్న నాయక్ పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: గ్రామీణ యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని వైఎస్సార్‌సీపీ జేసీఎస్ మండల అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి తెలిపారు. సంక్రాంతి సందర్భంగా ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం క్రికెట్ పోటీలను ప్రారంభించారు. గెలుపొందిన జట్లకు శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సహకారంతో వరుసగా రూ.30వేలు, 20వేలు, రూ.10వేల నగదు బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో సుమారు 50 జట్లు పోటీపడతాయని చెప్పారు. పీఈటీ శ్రీనివాసులు, రంగనాథ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

మిడుతూరు: స్థానిక ఆదర్శ పాఠశాల మైదానంలో గురువారం నిర్వహించిన కబడ్డీ పోటీల్లో చింతలపల్లి జట్టు విజేతగా నిలిచిందని వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన సెమీ ఫైనల్ క్రికెట్ పోటీల్లో కడుమూరు జట్టుపై మాసపేట జట్టు, వీపనగండ్ల పై మిడుతూరు జట్టు గెలుపొందింది.సెమీ ఫైనల్లో విజేతగా నిలిచిన మిడుతూరు, మాసపేట జట్టు మధ్య ఫైనల్ మ్యాచ్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఎంఈఓ శ్రీనాథ్, వ్యాయామ ఉపాధ్యాయులు ఊర్మిళ, ముస్తాహీర్ పాల్గొన్నారు.

నందికొట్కూరు: ఆడుదాం..ఆంధ్రాతో క్రీడాకారులను గుర్తించడమే ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ కిషోర్ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో మండల స్థాయి ఆడుదాం..ఆంధ్ర క్రికెట్, వాలీబాల్, షటిల్, ఖోఖో పోటీలు జరిగాయి.

మహానంది: ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో భాగంగా నిర్వహించిన వాలీబాల్ విభాగంలో అబ్బీపురం జట్టు నియోజకవర్గ స్థాయికి ఎంపికైందని ఎంపీడీఓ శివనాగజ్యోతి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ మహానంది జట్టుపై అబ్బీపురం జట్టు విజయం సాధించినట్లు చెప్పారు. సీతారామాపురం, బుక్కాపురం జట్ల మధ్య జరిగిన కబడ్డీ పోటీల్లో బుక్కాపురం జట్టు నియోజకవర్గ స్థాయికి చేరినట్లు తెలిపారు.



ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు









గెలుపొందిన జట్టుతో అధికారులు, నాయకులు, పగిద్యాల-3. లక్ష్మాపురం-2 మధ్య జరిగిన కబడ్డీ పోటీలో తలపడిన క్రీడాకారులు, క్రీడాకారులను పరిచయం చేసుకొంటున్న నాగార్జునరెడ్డి, కృష్ణారెడ్డి, కబడ్డీ విజేతగా నిలిచిన చింతలపల్లి జట్టు

ఓటరు జాబితాపై అభ్యంతరాలకు సత్వర పరిష్కారం



ఓటర్ల దరఖాస్తులను పరిశీలిస్తున్న ఆర్డీఓ దాసు

నందికొట్కూరు: ఓటరు జాబితా అభ్యంతరాలకు సత్వర పరిష్కారం చూపుతామని ఆర్డీఓ మిరియాల దాసు తెలిపారు. గురువారం పట్టణంలోని అలువాల సత్రంలో ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తులను పరిశీలించారు. బీఎల్వోలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో కొత్త ఓటర్ల దరఖాస్తులను పరిశీలించి నమోదు చేస్తున్నామన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు సత్వరమే పరిష్కరించనునట్లు చెప్పారు. గడువులోపు పెండింగ్ దరఖాస్తులు పూర్తిస్థాయిలో పరిష్కరించాలని ఆదేశించారు. తహసీల్దార్లు రాజశేఖర్‌బాబు, పుల్లయ్య, భారతి, రత్నరాధిక, చంద్రశేఖర్‌నాయక్, ప్రకాష్‌బాబు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

విధులకు గైర్హాజరైన డాక్టర్‌పై జిల్లా అధికారి ఆగ్రహం



హాజరు పట్టికను పరిశీలిస్తున్న అదనపు జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ శారదబాయి

జూపాడుబంగ్లా: తెల్లవారితే జగనన్న ఆరోగ్యసురక్ష వైద్య శిబిరం పెట్టుకొని విధులకు గైర్హాజరైన స్థానిక ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ గంగాధర్‌పై జిల్లా అదనపు వైద్యాధికారిణి డాక్టర్ శారదబాయి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆమె పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ముందుగా హాజరు పట్టికను పరిశీలించి ఎవరెవరు విధులకు హాజరయ్యారంటూ ఆరా తీశారు. ఆ సమయంలో ఆసుపత్రిలో ఇద్దరు వైద్యులు ఉండాల్సి ఉండగా కేవలం డాక్టర్ సభా మాత్రమే ఉండగా మరో డాక్టర్ గంగాధర్ ఎక్కడంటూ ఆరా తీశారు. నేరుగా ఆయనకు ఫోన్‌చేసి ఎక్కడున్నావంటూ ప్రశ్నించగా పొంతనలేని సమాధానం ఇవ్వటంతో ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హాజరు పట్టికలో క్వశ్చన్ మార్కు వేశారు. ఇకపై ఎలాంటి సమాచారం లేకుండా మూవ్‌మెంటు రిజిష్టర్‌లో నమోదు చేయకుండా విధులకు గైర్హాజరైతే ఉపేక్షించేదిలేదని గంగాధర్‌ను హెచ్చరించారు. అనంతరం ఆసుపత్రి రికార్డులు పరిశీలించటంతో పాటు కుష్టువ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే రికార్డులను ఆమె పరిశీలించారు. వివరాలను లెప్రసీ నోడల్ అధికారి రాముడును అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో హెల్త్ సూపర్‌వైజర్లు రాముడు, విజయలక్ష్మమ్మ, టెక్నిషియన్ చెన్న, వైద్యసిబ్బంది వెంకటేశ్వర్లు, వెంకటరవణమ్మ ఉన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

పగిద్యాల: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన ఘటన గురువారం ఎం. ఘణపురం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన తుమ్మకొమ్మ నాగరత్నం ఇంట్లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మీటర్ బోర్డు నుంచి నిప్పులు ఎగిసిపడ్డాయి. దీంతో మంటలు వ్యాపించి ఇంటిలోని బీరువా, ఫ్రిజ్, టీవీ, మంచాలు, వంటసామగ్రి, దుస్తులు, నిత్యావసర సరుకులు కాలిబూడిదయ్యాయి. ప్రమాద ఘటనపై స్థానికులు కర్నూలు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చినా వాహనం వచ్చేలోపు ఇంట్లోని సామగ్రి పూర్తిగా కాలిపోయిందని బాధితులు వాపోయారు. ప్రమాదంలో సుమారు రూ. లక్ష మేర ఆస్తినష్టం వాటిల్లిందని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

పశుగ్రాసం దగ్ధం

మహానంది: యు. బొల్లవరం గ్రామంలోని రైతు నాగరాజుకు చెందిన వరిగడ్డి ప్రమాదవశాత్తు నిప్పంటుకొని గురువారం దగ్ధమైంది. పశుగ్రాసం కోసం గడ్డిని నిల్వ ఉంచుకోగా కాలిపోయిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదంలో సుమారు. రూ. 25 వేలకు పైగా నష్టం వాటిల్లిందని రైతు తెలిపారు. తిమ్మాపురం గ్రామ సమీపంలోని పొలాల్లో మంటలు చెలరేగిన ఘటన సమాచారం తెలుసుకున్న నంద్యాల అగ్నిమాపక కేంద్రం సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు.

విజయవంతం చేయండి

కొత్తపల్లి: మండలంలో ఈనెల 14వ తేదీ నుంచి జరిగే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ మేరి గురువారం తెలిపారు. మండలంలో 14 నుంచి 18వ తేది వరకు గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన, చేస్తున్న సంక్షేమ పథకాలు, పలు అభివృద్ధి కార్యాక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని చెప్పారు.

ఈరోజు

అల్లూరులో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

నందికొట్కూరు రూరల్ : మండలంలోని అల్లూరు గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత మెడికల్ క్యాంపు నిర్వహిస్తామని ఎంపీడీఓ శోభారాణి గురువారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ కార్యక్రమానికి సంబంధిత అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

జూపాడుబంగ్లా: స్థానిక రెండవ సచివాలయం పరిధిలో శుక్రవారం జగనన్న ఆరోగ్యసురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నూర్జహాన్ తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ రెండో విడత జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమంలో భాగంగా నేటి నుంచి అన్ని సచివాలయాల పరిధిలో ఫిబ్రవరి వరకు వైద్యశిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. ఇందులో నిపుణులైన వైద్యులు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాల కోరారు.

మండల సర్వసభ్య సమావేశం

వెలుగోడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ షేక్ అమానుల్లా తెలిపారు. ఎంపీపీ లాలం రమేష్ అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో పలు అంశాలపై చర్చించనున్నట్లు చెప్పారు. అన్ని శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరు కావాలని, మండలంలో ప్రజా ప్రతినిధులు సమావేశంలో పాల్గొనాలని కోరారు.

నేడు అభివృద్ధి పనుల ప్రారంభం

మహానంది: మండలంలో శుక్రవారం పలు అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు శాసనసభ ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి రానున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొమ్మా మహేశ్వరరెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ గాజులపల్లెలో రెండు రైతు భరోసా కేంద్రాలు, డ్రైనేజీ కాల్వలను ప్రారంభిస్తారన్నారు. బుక్కాపురంలో నూతనంగా వేసిన సీసీ రోడ్లు, అబ్బీపురంలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్, రైతు భరోసా కేంద్రం, తాగునీటి పైపు లైన్, సీసీ రోడ్లు ప్రారంభిస్తారని చెప్పారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూరు: అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యునియన్ నాయకురాళ్లు మంజుల, లక్ష్మీదేవి, ప్రమీల కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ఓం, అల్లా, శిలువ ఆకారంలో కూర్చొని నిరసన వ్యక్తం చేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం





చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి,దేవ సహాయానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

మహానంది: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. బండిఆత్మకూరు మండలం సోమయాజులపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు చక్రపాణి కుమారుడు సాయి చరణ్‌కు గురువారం రూ.రెండు లక్షల చెక్కు అందించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నేత శిల్పా భువనేశ్వరరెడ్డి, ఎంపీటీసీ రామయ్య, చక్రపాణి, తిరుపతయ్య పాల్గొన్నారు. అలాగే పెద్దదేవలాపురం గ్రామంలోని కళాకారులకు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి రూ.15వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

నందికొట్కూరు/జూపాడుబంగ్లా: ఆపదలో ఉన్న వారికి అండగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నాడన్న నమ్మకమే సగం బలాన్ని ఇస్తుందని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ తెలిపారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధితులకు అందజేశారు. కొత్తపల్లి మండలంలోని ఎర్రమఠం గ్రామానికి చెందిన శీలం మనోహర్‌రెడ్డి, కొత్తపల్లి గాయత్రి, మాధవరం ప్రకాశం, విష్ణువర్ధన్ రూ.3.42 లక్షల చెక్కులను, పారుమంచాల గ్రామ సర్పంచ్ మాధవరం ప్రకాశం అనారోగ్యంతో శస్త్రచికిత్స చేయించుకోగా ఆయనకు సీఎం రిలీఫ్ ఫండు కింద రూ.62వేలు మంజూరయ్యాయి. ఆ చెక్కును ఆయన కుమారుడు మాధవరం దేవసహాయానికి ఎమ్మెల్యే అందజేశారు. తాటిపాడు వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉస్మాన్‌బాషా పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేసిన ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

రక్తదానం



రక్తదానం చేస్తున్న చక్రవర్తి

వెలుగోడు: ఆపదలో ఉన్న ఓ మహిళకు టైలర్ చక్రవర్తి రక్తదానం చేసి ఆదుకున్నారు. నంద్యాలలోని శాంతిరాం హాస్పిటల్ లో కిడ్నీ సమస్యతో డయాలసిస్ చేయించుకుంటున్న ఆత్మకూరుకు చెందిన లక్ష్మీదేవమ్మకు 'ఓ' పాజిటివ్ రక్తం అవసరమైంది. రక్తదాత కోసం కుటుంబసభ్యులు ఎదురుచూస్తుండగా గుంతకందాల గ్రామ వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు సుధాకర్ నాయక్ సహకారంతో వెలుగోడులోని చక్రి టెక్స్‌టైల్ షాప్ నిర్వాహకుడు చక్రవర్తి నాయక్ నంద్యాల వెళ్లి రక్తదానం చేశాడు. ఆయనను వైస్ ఎంపీపీ కొడావత్ శంకర్ నాయక్, గ్రామస్తులు అభినందించారు.

చీకటి జీవితాల్లో వెలుగులు

- బాధితులను ఆదుకున్న జగనన్న ఆపన్న హస్తం
- రూ.5వేల పింఛన్, రూ.5లక్షల సహాయం అందజేత

ఆత్మకూరురూరల్: చిన్న కుదుపు చాలు నిరుపేదల జీవితాలు తల్లకిందులవడానికి. ఓ సంఘటన వారి జీవితాన్ని చీకటిలా కమ్మేయడం, నా అనే ఆపన్న హస్తం కనిపించకపోవడంతో వారి జీవితం ప్రశ్నార్థకంగా మారింది. అయితే జగనన్న ప్రభుత్వంలో ఇలాంటి నిస్పృహలకు తావులేదు. ఆత్మకూరు మండలం కురుకుంద గ్రామంలో ఛిద్రమైన ఇద్దరు నిరుపేద యువకుల జీవితాలను నిలబెట్టింది ముఖ్యమంత్రి సహాయ నిధి.

ఉపాధి కోల్పోయిన శివుడు..

కురుకుందలో నాయీబ్రాహ్మణుడైన చిన్న శివుడు కుల వృత్తి నిర్వహించుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. 15 ఏళ్ల కిందట ఒక కాలుపై చిన్నగా వాపు మొదలైంది. అది బోదకాలు వ్యాధిగా నిర్ధారించబడింది. సన్నగా మొదలైన వాపు.. చెట్టు మొదలంతా లావైపోయి కదలడానికే తీవ్ర ఆటంకంగా మారింది. దీంతో శివుడు జీవన భృతి కోల్పోయి ఇంటికే పరిమితం కావాల్సి వచ్చింది. భార్య కూలీ పనులతో కుటుంబం సాగాల్సివచ్చింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో సాధారణ పింఛన్ కోసం ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా నిభందనల సాకుతో నిరాకరించారు. జగనన్న పాలనలో జెడ్పీటీసీ సభ్యుడు శివశంకరరెడ్డి శివుడి సమస్యను ఎమ్మెల్యే చక్రపాణి రెడికి వివరించారు. ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నెలకు రూ.5వేల పింఛన్, వైద్యం చేయించుకునేందుకు రూ.5లక్షల సీఎం రిలీఫ్ ఫండ్‌ను కూడా మంజూరు చేయించారు.

బతుకు యంత్రం కాటేసింది..

కురుకుంద గ్రామానికి చెందిన పి.వలిముర్తుజా మధ్యతరగతికి చెందిన యువకుడు. భార్య,ముగ్గురు పిల్లలు, తల్లితో కూడిన కుటుంబానికి వలి సంపాదనే జీవనాధారం. తనకు ఉన్న ట్రాక్టర్‌ను బాడుగలకు తిప్పుతూ జీవనం సాగించేవాడు. దినచర్యలో భాగంగా ఓ పొలంలో ట్రాక్టర్‌తో పనులు చేయిస్తుండగా ప్రమాదవశాత్తు తన కాలు ట్రాక్టర్‌లో చిక్కుకుపోయి తొడవరకు నుజ్జు,నుజ్జయి తెగిపోయింది. ప్రాణాలు దక్కినప్పటికీ.. బతుకు చీకటి మయమైంది. ఉపాధి లేకపోవడంతో కుటుంబ జీవనం ఇబ్బందిగా మారింది. వాకర్‌తో నడుస్తున్నప్పటికీ సంపాదన లేకపోయింది. చివరకు గ్రామ నాయకుల సహాయంతో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డికి తన సమస్యను వివరించాడు. ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రూ.5వేల పింఛన్, సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.5లక్షలు మంజూరు చేయించారు. దీంతో వారి కుటుంబానికి కాస్త ఆదరణ లభించింది.

జగనన్న నా జీవితాన్ని నిలిపారు



సీఎం జగనన్న సంక్షేమ దృష్టి కారణంగానే నా జీవితం నిలిచింది. నాకు అందుతున్న పింఛన్‌తో కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. అలాగే సీఎం రిలీఫ్ ఫండ్ సొమ్ముతో ఏదైన వ్యాపారం పెట్టుకుని జీవితాన్ని కొనసాగిస్తాను.సీఎంకు, ఎమ్మెల్యే శిల్పాకు రుణపడి ఉంటాను. - పి.వలీ ముర్తుజా ,కురుకుంద

జగనన్న నాకు జీవితాన్ని ప్రసాదించారు



మానులా ఉన్న కాలును మోయలేక జీవితంపై విరక్తి కలిగి జీవితాన్ని చాలించాలనే నిర్ణయానికి వచ్చాను. అపుడు నా పరిస్థితి ముఖ్యమంత్రి దృష్టికెళ్తే బతుకు మారే అవకాశముందని తెలియడంతో మా ఊరి నాయకుడు జెడ్పీటీసీ శంకరరెడ్డి ద్వారా ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డికి నా సమస్యను విన్నవించాను. ఆయన చొరవతో వెంటనే నాకు రూ.5వేల ఫింఛన్ మంజూరైనట్లు సచివాలయ వలంటీర్ చెప్పింది. ఇటీవల ఎమ్మెల్యే శిల్పా మా గ్రామానికి వచ్చి నాకు రూ.5లక్షల చెక్కు అందించి అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. ముగింపు పలకాలన్న నా జీవితానికి కొనసాగింపు ప్రసాదించిన సీఎం జగనన్న నాకు మళ్లీ జీవితాన్ని ప్రసాదించాడు.

- చిన్న శివుడు,కురుకుంద

పాపహరణం.. తాండవ మల్లేశ్వరుని దర్శనం

- 14 నుంచి సంక్రాంతి సంబరాలు ప్రారంభం
- 15న శ్రీ పార్వతీ సమేత తాండవ మల్లేస్వామి కల్యాణ మహోత్సవం
- 17 వరకు ఉత్సవాలు



తాండవమల్లేశ్వర స్వామి ఆలయం,(ఇన్‌సెట్) స్వయంభువుగా వెలసిన శివ లింగం, పార్వతిదేవి అమ్మవారు

కొత్తపల్లి: మండల కేంద్రం కొత్తపల్లిలో వెలసిన శ్రీతాండవమల్లేశ్వరస్వామిని దర్శించుకొంటే సకల పాపాలు తొలగిపోవడంతో పాటు కోర్కెలు తీరుస్తూ భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్నాడు. కొత్తపల్లిలో ఈనెల 14 నుంచి 17 తేదీవరకు సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని పార్వతీసమేత తాండవ మల్లేస్వామివార్ల ఉత్సవాలను నిర్వహించడం అనవాయితీ. ఇందుకు స్వామిఅమ్మవార్ల ఆలయాన్ని ఆలయ కమిటీ, భక్తులు, గ్రామస్తులు ముస్తాబు చేస్తున్నారు. ఈ ఆలయానికి ఎంతో ప్రశస్థమైన చరిత్ర ఉందని స్థానిక చరిత్ర పేర్కొంటుంది. హరివరం, చింతలపల్లె, తులసిపురం, పాడు, సోమేశ్వరంగ్రామాలలో గతంలో గత్తర (కలరా) వ్యాధి వ్యాపించడంతో ఎంతో జననష్టం జరిగింది. దీంతో మిగిలిన ప్రజలందరూ కలసి నల్లమల అటవీ ప్రాంతంలో కొత్త గ్రామాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అప్పటి పరిస్థితులలో కొత్తగా ఏర్పడిన గ్రామమే నేడు కొతపల్లిగా పిలువబడుతోందని పెద్దలు చెబుతున్నారు. మండలంలో ప్రాచీన ప్రసిద్ధి చెందిన సంగమేశ్వరం, కొలనుభారతి దేవి ఆలయాల తరహాలోనే తాండవ మల్లేశ్వరస్వామి ఆలయం వెలిసింది. ఆలయాన్ని జనమేజయ మహారాజు నిర్మించినట్లు శాసనాల ద్వారా తెలుస్తుంది. రాయలవారి పాలనలో శ్రీశైలంలో ప్రధాన గోపుర నిర్మాణ సమయంలో అక్కడున్న బయలు వీరభద్రాలయంలో శ్రీతాండవ మల్లేశ్వరస్వామి ఆలయం గురించిన తాళపత్ర గ్రంథాలు, శాసనాలు ఉండడంతో కృష్ణదేవరాయాలు కూడా శ్రీపార్వతీసమేత తాండవ మల్లేశ్వర స్వామిని సేవించినట్లు తెలుస్తుంది. ఈ ఆలయంలో ఉగ్రరూపం దాల్చిన పరమేశ్వరుడు ఆగ్రహంతో శివ తాండవం చేసి ఇక్కడ పరమశివుడు స్వయంభువుగా వెలసినట్లు పురాణాలు పేర్కొంటున్నాయి. అందుకే ఈ ఆలయానికి తాండవ మల్లేశ్వరస్వామి ఆలయం అనే పేరు వచ్చిందని ఆయా గ్మారాల పెద్దలు చెబుతున్నారు. ఇక్కడి ఆయలంలోని శివలింగం శ్రీశైలంలోని జ్యోతిర్లింగ శివలింగాన్ని పోలిఉండడం విశేషం .స్వామివారు స్వయంభూగా వెలియడంతో స్వామి అమ్మవార్లను దర్శించుకొని భక్తి శ్రద్ధలతో పూజలు చేసుకొని దర్శించుకుంటే సకల పాపాలు హరించబడతాయని, కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల ప్రగాఢవిశ్వాసం. ఈ నేపథ్యంలోనే ఏటా జనవరిలో సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని ఉత్సవాలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఈనెల 14న స్వామివార్లకు బిందెసేవ, గణపతిపూజ, అంకురార్పణ, తాండవ మల్లేశ్వరస్వామిని (శుభ మూహుర్తం) పెళ్లికుమారుడిగా ముస్తాబు చేస్తారు. 15న అర్ధ రాత్రి స్వామిఅమ్మవార్ల కల్యాణమహోత్సవం కనుల పండువగా జరిపిస్తారు. 16న ప్రభోత్సవం, 17న ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ , పారువేట ఉంటుంది. ఉత్సవాలకు నందికొట్కూరు, ఆత్మకూరు నియోజకవర్గాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివస్తారు.